# Telangana State tops in e-Transactions - News Clipping

## from EENADU 26th Jan. 2016

# ఈ-లావాదేవీల్లో తెలంగాణ భేష్

- అధ్యయనానికి బృందాలను పంపిన కేంద్రం
- ఇతర రాష్ట్రాలకూ ఆదర్శమంటూ కితాబు

ఈనాడు - హైదరాబాద్

దేశవ్యాప్తంగా ఎలక్ట్రానిక్ లావాదేవీల్లో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. కేంద్రప్రభుత్వ ఎలక్ట్రానిక్ లావాదేవీల గణాంక, విశ్లేషణ సంస్థ(ఈతాల్) దీనినే నిర్ధారిస్తోంది. అది అందించిన తాజా గణాంకాల ప్రకారం.. తెలంగాణలో ప్రతి వెయ్యిమంది జనాభాకు సగటున 1536 ఎలక్ట్రానిక్ లావాదేవీలు జరుగుతున్నాయి. 2015 జనవరి నుంచి ఈ ఏడాది జనవరి 25 వరకూ చూసినా.. అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణలోనే అత్యధిక ఈ-లావాదేవీలు సాగుతున్నట్లు తేలింది. ఈ-పాలన దిశగా పయనిస్తూ డిజిటల్ సేవలను ప్రోత్సహిస్తున్న కేంద్రం.. తెలంగాణ ఐటీశాఖ అందిస్తున్న ఎలక్ట్రానిక్ సేవల్ని ప్రశంసించింది. మిగిలిన రాష్ట్రాలకూ ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతో అక్కడి కార్యక్రమాలు, మీ-సేవ, ఈ-సేవ కేంద్రాలపై అధ్యయనానికి రెండు బృందాలను పంపింది. ఇటీవలే పని ముగించిన ఆ బృందాలవారు "తెలంగాణ పద్ధతులు అన్ని రాష్ట్రాలకూ అనుసరణీయంగా ఉన్నాయ"ని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 32 శాఖలకు సంబంధించిన 350కి పైగా సేవలను ప్రభుత్వం మీ-సేవ, ఈ-సేవల ద్వారా ప్రజలకు చేరవేస్తోంది. రాష్ట్ర విభజన నాటి నుంచి గత నవంబరు వరకు తెలంగాణలో 2కోట్ల ఈ-లావాదేవీలు జరిగాయి. మీ-సేవ ఆరంభించే(2011-12) నాటికి 55 సేవలతో 0.51 కోట్లున్న లావాదేవీల సంఖ్య గత నెలలో 5.63 కోట్లకు చేరింది.

**భద్రాద్రి, యాదాద్రిలకు ఆన్‌లైన్ బుకింగ్..:** భద్రాద్రి(భద్రాచలం), యాదాద్రి(యాదగిరిగుట్ట)ల్లో స్వామి వారి సేవలు, వసతి సౌకర్యాలను తిరుమల తరహాలో ఆన్‌లైన్‌లోనే బుక్‌చేసుకొనే వెసులుబాటును తెలంగాణ మీ-సేవ ద్వారా కల్పిస్తున్నారు.వేములవాడ, బాసరల్లోనూ త్వరలో సంబంధిత ఏర్పాట్లు చేస్తున్నామని తెలంగాణ ఈ-గవర్నెన్స్ ప్రత్యేక సంచాలకులు వెంకటేశ్వరరావు తెలిపారు. "అన్ని రాష్ట్రాల్లోనూ ఈ-లావాదేవీల వేదికలున్నా సేవల్ని అందిస్తున్న తీరులో, సంఖ్యలో తెలంగాణ విశిష్టంగా నిలుస్తోంది. అందుకే కేంద్రం ఇక్కడ అధ్యయనం చేయించింది. ప్రతినెలా విదేశాల నుంచీ అనేక ప్రతినిధి బృందాలు తెలంగాణకు వచ్చి వెళుతున్నాయి" అన్నారాయన.